
సాక్షి పెద్దపల్లి

గురువారం । 16 । మార్చి । 2023



పత్తి క్వింటాల్‌కు రూ.7,262

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మార్కెట్‌లో క్వింటాల్ పత్తికి రూ.7,262 పలికింది. కనిష్టంగా రూ.6,227, మోడల్ రూ.7,151 నమోదైనట్లు దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.



సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

మంథని:టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. నిరుద్యోగులతో ఆడుకోవద్దన్నారు.

గరిష్టం/కనిష్టం
35.0/22.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశముంది. చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

గోటితో కోటి తలంబ్రాలు



గోటితో తలంబ్రాలను ఒలుస్తున్న మహిళలు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని తారుపల్లి లోగల శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో భద్రాద్రి రామయ్య పెళ్లి కోసం కోటి తలంబ్రాలను గోటితో ఒలిచే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈనెల 30న శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలోని శ్రీరాముడి ఆలయంలో జరిగే శ్రీసీతారామ కల్యాణ మహోత్సవానికి తలంబ్రాలను పంపించనున్నారు. గ్రామస్తులు, అర్చకులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

క్రీడాకారులకు స్పోర్ట్స్ దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్

రామగిరి(మంథని): మంథని జేఎన్టీయూ క్రీడాకారులకు స్పోర్ట్స్ దుస్తులను కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ బుధవారం అందించారు. వివిధ క్రీడల్లో పాల్గొనడానికి వెళ్తున్న క్రీడాకారులకు దుస్తులు కొనుగోలు చేసి పంపిణీ చేసినట్లు తెలిపారు. క్రీడాకారులు అన్నిరంగాల్లో రాణించి కళాశాలకు పేరు తేవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్ రెడ్డి, ఈఈఈ అధిపతి దుర్గారావు, ఆఫీస్ సూపరింటెండెంట్ రవికుమార్, ఫిజికల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి, హాస్టల్ ఇన్‌చార్జి సుమన్ పాల్గొన్నారు.


స్వయం ఉపాధిపై దృష్టి సారించాలి



సర్టిఫికెట్ అందుకుంటున్న మహిళ

మంథని: మహిళలు స్వయంఉపాధి పథకాలపై దృష్టి సారించాలని నాబార్డు డీడీఎం అనంత్ సూచించారు. మహిళలకు ఎంబ్రాయిడింగ్‌పై మంథనిలో నెలరోజులపాటు ఇచ్చిన శిక్షణ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. స్వయంఉపాధి పథకాలపై శిక్షణ పొందడం ద్వారా రాణించవచ్చని సూచించారు. కేడీసీసీ బ్యాంక్ మంథని మేనేజర్ దుమ్మని లక్ష్మణ్ మాట్లాడుతూ శిక్షణ పొందిన మహిళలకు తమ బ్యాంకు ద్వారా రుణ సదుపాయం కల్పిస్తామని వెల్లడించారు. మహిళలు కుట్లు, అల్లికలు నేర్చుకోవడం ద్వారా వారి కుటుంబానికి కొంత వెసులుబాటుగా ఉంటుందన్నారు.

కంటివెలుగు ద్వారా ప్రతి ఒక్కరికీ పరీక్షలు



శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

సుల్తానాబాద్: కంటివెలుగు శిబిరాలను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ అన్నారు. పట్టణంలోని గాంధీనగర్ 10వ వార్డులో నిర్వహించిన ఉచిత కంటివైద్య శిబిరాన్ని బుధవారం తనిఖీ చేశారు. 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరిని శిబిరానికి తరలించాల్సిన బాధ్యత ఆశ కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో కంటివెలుగు ప్రోగ్రాం నోడల్ అధికారి మహేందర్, అధికారులు రాజేశం, శ్రీనివాస్ గౌడ్, మధుకర్ రెడ్డి, శ్రీజ, హెచ్‌ఈఓ శ్రీనివాస్ రెడ్డి, ఏఎన్‌ఎంలు శారద, కవిత, డీఈఓ మానస, ఆప్తాలిక్ సహనాజ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపాలిటీలోని మైనార్టీలు కార్పొరేషన్ రుణాలకు చేసుకున్న దరఖాస్తులను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. 16 యూనిట్లు మంజూరుకు.. 600 పైచిలుకు దరఖాస్తులు అందాయి. ప్రాధాన్యత ప్రకారం పేర్లను ఎంపిక చేసి ఉన్నతాధికారులకు అందిస్తామని కమిషనర్ తెలిపారు.



ఆలస్యం కావడంతో పరుగోపరుగు..



కేంద్రంలోకి వెళ్తూ..



జిల్లాకేంద్రంలోని పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు







విద్యార్థినుల సెల్ఫీ

తొలిరోజు ప్రశాంతం

● 308 మంది విద్యార్థులు గైర్హాజరు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో బుధవారం మొదలైన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. 6,051 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 5,743 మంది హాజరయ్యారు. 308 మంది గైర్హాజరైనట్లు ఇంటర్ నోడల్ అధికారి కల్పన తెలిపారు. నిమిషం ఆలస్యం నిబంధన అమలు చేశారు. కొందరు విద్యార్థులు చివరి సెకన్లలో ఉరుకులు, పరుగుల మీద పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. గైర్హాజరైన వారిలో జనరల్ విద్యార్థులు 217 మంది, వొకేషనల్ విద్యార్థులు 91 మంది ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. జూలపల్లి కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ సంగీత తనిఖీ చేశారు.

'డబుల్' సంబరం



లాటరీ ఎంపిక ప్రక్రియకు హాజరైన దరఖాస్తుదారులు



లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తున్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

- జిల్లాకేంద్రంలో లక్కీడ్రా ద్వారా లబ్ధిదారుల ఎంపిక
- 1050మంది అర్హులలో 484 మంది ఎంపిక
- ఉగాది రోజు లబ్ధిదారులతో గృహప్రవేశాలు
- నేడు రామగుండం కార్పొరేషన్ పరిధిలో లాటరీ

సాక్షి, పెద్దపల్లి: సొంతింటి కోసం నిరీక్షిస్తున్న నిరుపేదలకు గృహ యోగం కలిగింది. పెద్దపల్లి మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన రెండు పడకల గదుల ఇళ్ల కేటాయించేందుకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. అర్హులు భారీగా.. ఇళ్లు తక్కువగా ఉన్న నేపథ్యంలో లబ్ధిదారుల ఎంపికకు యంత్రాంగం 'లక్కీడ్రా' విధానాన్ని ఎంచుకుంది. సొంత ఇళ్లు, స్థలం లేనివారిని అర్హులుగా గుర్తించి.. సామాజికవర్గాల వారీగా రిజర్వేషన్ కేటగిరీని అనుసరించి లబ్ధిదారుల సమక్షంలోనే డ్రా నిర్వహించారు. పెద్దపల్లి తహసీల్దార్ ఆధ్వర్యంలో అధికారులు, వార్డు కౌన్సిలర్ల సమక్షంలో నిబంధనల ప్రకారం డ్రా పద్ధతి చేపట్టి అదనపు కలెక్టర్ లక్ష్మీనారయణ లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఇందులో ఎంపికైన లబ్ధిదారులకు త్వరలోనే ఇంటి నంబర్లను కేటాయించి, వారితో గృహప్రవేశాలు చేయించనున్నారు.

నేడు రామగుండంలో ఎంపిక

జిల్లాకేంద్రంలో డబుల్ బెడ్రూం ఇళ్లకోసం 2,079మంది దరఖాస్తు చేసుకోగా.. 1050 మందిని అర్హులుగా గుర్తించారు రెవెన్యూ అధికారులు. వీరిలో రిజర్వేషన్ల ప్రకారం ఎస్సీ కోటాలో 81 మంది, ఎస్టీ కోటాకింద 10 మంది, మైనార్టీ కోటాలో 55 మంది, ఓపెన్ కేటగిరీలో 321 మందితో కలిపి మొత్తం 484 మందిని డ్రా ద్వారా ఎంపిక చేశారు. ప్రతి కేటగిరీలో దివ్యాంగులకు 5శాతం రిజర్వేషన్‌తో 24 ఇళ్లు కేటాయించారు. అంతర్గాంలో 60 గృహాలు సిద్ధమయ్యాయి. వీటికి 1058 మంది దరఖాస్తు చేసుకున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు సర్వే నిర్వహించి 392 మందిని అర్హులుగా గుర్తించి తుది జాబితా ప్రకటించారు. రామగుండం పరిధిలో 620 డబుల్ బెడ్‌రూం గృహాలు సిద్ధం కాగా 7,672 దరఖాస్తులు వచ్చాయి. ఇక్కడ 2,380 మందిని అర్హులుగా గుర్తించారు. వీరికి గోదావరిఖని జీఎం కార్యాలయంలో లక్కీడ్రా పద్ధతిన లబ్ధిదారులను గురువారం ఎంపిక చేయనున్నారు. తరువాత ఓదెల, కాల్వశ్రీరాంపూర్ గ్రామాల్లోని లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. గతంలో డబుల్ బెడ్రూం పథకం ప్రారంభించిన మొదట్లో డ్రాలో 160మందిని ఎంపిక చేశారు. ఆ జాబితాను పక్కకు పెట్టి కొత్తగా డ్రా ద్వారా ఎంపిక చేయడంపై అక్కడి స్థానికులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.

గృహలక్ష్మిపైనే గంపెడాశలు

సొంత స్థలంలో ఇళ్లు నిర్మించుకునే వారికి రూ.3లక్షలు ఇస్తామని ఇటీవలే ప్రభుత్వం ప్రకటించిన విషయం తెల్సిందే. ఈ పథకం కింద నియోజకవర్గానికి మూడువేల మందిని ఎంపిక చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఇదే జరిగితే పేదలకు మరింత మేలు జరగనుంది. ఇళ్లు నిర్మించుకోవాలని నిరుపేదలు ఉత్సాహంగా ఉండటంతో జిల్లాలో నిర్మాణ రంగం మరింత జోరందుకోనుంది. అయితే సెంటు భూమిలేని వారు, లక్కీడ్రాలో ఇళ్లు రాని వారిలో మాత్రం నిరుత్సాహం కనిపిస్తోంది. తమ బతుకులు కిరాయి ఇళ్లల్లోనే కొనసాగాల్సిన పరిస్థితి నెలకొందని, ప్రభుత్వం మిగిలిన డబుల్ బెడ్రూం ఇళ్లను పూర్తిచేసి అర్హులకు అందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అలాగే గృహలక్ష్మి పథకాన్ని సైతం కేవలం మూడు వేలమందికే కాకుండా అర్హత ఉండి, సొంత స్థలం కలిగిన ప్రతి ఒక్కరికీ వర్తింప జేయాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా లబ్ధిదారుల ఎంపికలో నేతల ప్రమేయం లేకుండా కలెక్టర్ల పర్యవేక్షణలో జరిగేలా చూడాలంటున్నారు.

ఆనందంగా ఉంది



ఎన్నో ఏళ్ల నుంచి సాగర్ రోడ్డులో అద్దె ఇళ్లలో ఉంటున్నం. అద్దె చెల్లించలేక అవస్థలు పడ్డాం. కైకిలి చేసుకుని జీవనోపాధి పొందుతున్న మాకు ప్రభుత్వం అందించిన రెండు పడకల ఇల్లు రావడం ఆనందంగా ఉంది. వీలైనంత తొందరగా ఇంటి తాళాలు ఇచ్చి గృహప్రవేశాలు చేయిస్తే బాగుంటుంది.

– గంగాధర స్వరూప, లక్కీడ్రా విజేత

40 ఏళ్లుగా కిరాయి ఇంట్లోనే



నా భర్త లక్ష్మణ్ చనిపోయాడు. ఇద్దరు కొడుకులు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. 40ఏళ్లుగా పెద్దపల్లిలో కిరాయి ఇంట్లో నివాసం ఉంటూ ఇబ్బందులు పడుతున్నాం. లక్కీడ్రాలో ఇల్లు రావడం ఆనందంగా ఉంది.

– మాడిశెట్టి భాగ్యలక్ష్మి, దివ్యాంగురాలు

కల నెరవేరింది



రోజువారి పనిచేసుకోవడం ద్వారా వచ్చిన డబ్బులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. ప్రస్తుత రోజుల్లో లక్షలు ఖర్చు చేసి ఇల్లు కట్టాలంటే కష్టతరంగా ఉంటుంది. ప్రభుత్వ సాయంతో సొంతిల్లు రావడం మాకు సంతోషంగా ఉంది.

– వెగ్గాలపు క్రిష్ణవేణి, లక్కీడ్రా విజేత

అభ్యంతరాలు తెలపవచ్చు

ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్ కోటాలో లబ్ధిదారులను ఎంపిక చేశాం. లాటరీ ద్వారా ఎంపికైన లబ్ధిదారుల జాబితాను ప్రదర్శిస్తాం. అనర్హులు ఉన్నట్లు గుర్తిస్తే అభ్యంతరాలు తెలపవచ్చు. ఎంపికైన వారికి త్వరలోనే ఇంటినంబర్లు కేటాయిస్తాం.

– లక్ష్మీనారాయణ, అదనపు కలెక్టర్

కమిషనరేట్‌లో కీలకపోస్టులు ఖాళీ

- లాఅండ్‌ఆర్డర్, అడ్మిన్, ఆపరేషన్స్, ఏఆర్ డీసీపీ పోస్టులు ఖాళీ
- ఇబ్బంది పడుతున్న పోలీస్ సిబ్బంది, ప్రజలు
- పారిశ్రామిక క్షేత్రంలో కీలకంగా డీసీపీలు



రామగుండం పోలీస్ కమిషనరేట్

గోదావరిఖని: రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో కీలక అధికారులైన అడ్మిన్, ఆపరేషన్స్, లాఅండ్‌ఆర్డర్, ఏఆర్ డీసీపీల పోస్టులు ఖాళీ అయ్యాయి. ఇప్పటివరకు అడ్మిన్ డీసీపీగా ఉన్న అఖిల్‌మహాజన్ బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. ఇక్కడ పనిచేసిన లాఅండ్ ఆర్డర్ డీసీపీ అశోక్‌కుమార్ ఉద్యోగ విరమణ పొందారు. అడ్మిన్ డీసీపీ అఖిల్‌మహాజన్, ఆపరేషన్స్ డీసీపీ శరత్‌చంద్రపవార్, ఏఆర్ అడిషనల్ డీసీపీ సంజీవ్‌కుమార్ బదిలీపై వెళ్లారు. వీరి స్థానంలో ఎవరికీ పోస్టింగ్ ఇవ్వకపోవడంతో అటు పోలీసు సిబ్బందికి, ఇటు ప్రజలకు ఇబ్బందిగా మారింది.

అడ్మిన్ డీసీపీ లేక..

కమిషనరేట్‌కు అడ్మిన్ డీసీపీ చాలా కీలకం. ప్రస్తుతం పెద్దపల్లి డీసీపీకి అడ్మిన్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈయన ఉద్యోగుల సంక్షేమం, బదిలీలు, పదోన్నతులు, సీసీఆర్‌బీ, ఐటీ కోర్ విభాగాలను పర్యవేక్షిస్తున్నారు. అయితే కీలక అధికారి పోస్టు ఖాళీగా ఉండటంతో ఈ విభాగాల్లో పనులు జాప్యమవుతున్నాయని అంటున్నారు.

సరిహద్దుల్లో ఆపరేషన్స్ కీలకం..

కమిషనరేట్‌కు మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలున్నాయి. మావోయిస్టుల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టడంతోపాటు కీలక సమాచారాన్ని సేకరించి కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు ఆపరేషన్స్ విభాగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనికి సంబంధించిన ముఖ్య అధికారి పోస్టు కొన్ని నెలలుగా ఖాళీగా ఉంటోంది.

పారిశ్రామిక ప్రాంతంలో శాంతిభద్రతలు

పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో పారిశ్రామిక ప్రాంతం ఎక్కువగా ఉంది. సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్, కేశోరాం సంస్థలు ఉన్నాయి. రెండు జిల్లాల్లో నేర సంఘటనలు కూడా ఎక్కువే. సింగరేణిలో సమ్మె, ఎన్నికల సమయంలో లాఅండ్‌ఆర్డర్ సమస్య ఎక్కువగా ఉంటుంది. అధికారులను అప్రమత్తం చేస్తూ సమస్య జఠిలం కాకుండా దిశానిర్దేశం చేస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో లాఅండ్ ఆర్డర్ డీసీపీ పాత్ర కీలకంగా ఉంటుంది. రెండు జిల్లాల ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగే ఏఆర్ డీసీపీ పోస్టును ప్రభుత్వం భర్తీ చేయలేదు. రాష్ట్రంలోనే అత్యంత కీలకంగా ఉన్న కమిషనరేట్‌లో నాలుగు కుర్చీలు ఖాళీగా ఉండి అధికారుల కోసం ఎదురు చూస్తున్నాయి. త్వరలో సింగరేణిలో గుర్తింపు ఎన్నికలు జరగనున్న క్రమంలో ఈ నాలుగు పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్న డిమాండ్ స్థానికంగా వినిపిస్తోంది.

మంత్రులకు ఘన స్వాగతం



జ్యోతినగర్: హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో ఎన్టీపీసీ రామగుండం హెలిప్యాడ్‌కు చేరుకున్న మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డికి రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం మంత్రులు చెన్నూరు పర్యటనకు రోడ్డు మార్గం ద్వారా వెళ్లారు. చెన్నూరు ఎమ్మెల్యే బాల్కసుమన్, దేశపతి శ్రీనివాస్, సీపీ రెమా రాజేశ్వరి, ఎన్టీపీసీ రామగుండం అధికారులు, మేయర్ అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

సింగరేణి మెడికల్ సైన్స్‌గా మార్చండి

గోదావరిఖని: రామగుండం వైద్య కళాశాలను సింగరేణి మెడికల్‌సైన్స్‌గా మార్చాలని ఎమ్మెల్యే చందర్ మంత్రి హరీశ్‌రావును కోరారు. చెన్నూర్ వెళ్తున్న ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. వైద్యకళాశాల అడ్మిషన్లలో కార్మికుల పిల్లలకు ప్రత్యేక కోటా కల్పించాలని, కార్మికుల కోసం ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి వారం రోజుల్లో జీవో ఇస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

'కట్టా'ను పట్టుకున్నాం!

- 34 ఏళ్లుగా పంచాయతీరాజ్‌లో కట్టా విష్ణువర్ధన్ కొలువు
- 'సాక్షి' పరిశోధన కథనాలతో వెలుగుచూసిన వాస్తవం
- 1956లో తల్లి నిరూప, 1967లో విష్ణువర్ధన్ జన్మించినట్లు రికార్డులు
- ఉన్నత విద్య కోసం లీవులే పెట్టలేదని తేల్చిన అధికారులు
- క్రిమినల్ ఇన్‌టెన్షన్‌తో వ్యవస్థలను తప్పదోవ పట్టించాడని నివేదిక



కట్టా విష్ణువర్ధన్

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా 34ఏళ్లపాటు వ్యవస్థల కళ్లకు గంతలు కట్టాడు. ఎలాంటి అర్హత లేకున్నా.. కారుణ్య నియామకం కింద ఉద్యోగం పట్టాడు. ఉద్యోగం చేస్తూనే ఒక్కరోజు కూడా లీవు పెట్టకుండా ఇంజినీరింగ్ సర్టిఫికెట్లు కొట్టాడు. తన తల్లి తన కంటే కేవలం 10 ఏళ్లు మాత్రమే పెద్దదని రికార్డులు ఇచ్చి అధికారులను ఒప్పించాడు. దొడ్డిదారిన ప్రభుత్వ ఉద్యోగం సాధించి, సుప్రీంకోర్టు నిబంధనలకు వ్యతిరేకంగా పదోన్నతి పొంది ఇంతకాలం సమాజాన్ని మోసం చేస్తూ వస్తున్న పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజినీర్ కట్టా విష్ణువర్ధన్ ఆట ముగిసింది. 'పట్టుకోండి చూద్దాం' పేరుతో 'సాక్షి' కొంతకాలంగా ప్రచురిస్తున్న కథనాలు నిజమేనని అతని వ్యవహారంపై విచారణ జరిపిన అధికారులు తేల్చారు. ఇటీవలే దర్యాప్తు నివేదికను హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ ఈఎన్‌సీ కార్యాలయానికి పంపారు. ఈ నివేదిక ప్రతిని 'సాక్షి' సంపాదించింది. ఇంతకీ ఆ నివేదికలో ఏముందంటే..?

రికార్డులే లేవు.. అన్నీ అక్రమాలే..!

పంచాయతీ రాజ్ విభాగం వద్ద ఉన్న సమాచారం ప్రకారం.. కరీంనగర్ సబ్–డివిజన్, ఏఈ, కట్టా విష్ణువర్ధన్ 2మార్చి 1967లో కట్టా వెంకటనాగరత్నాచారి, కట్టా నిరూపకు కశ్మీర్‌గడ్డలో జన్మించారు. వీరిద్దరూ ప్రభుత్వ టీచర్లే. 1987లో నాగరత్నాచారి మరణించారు. తన తల్లి ప్రభుత్వ టీచరు అన్న విషయాన్ని దాచి 1988లో కారుణ్య నియామకం కింద పంచాయతీరాజ్‌లో అప్పటి ఉమ్మడి జిల్లాలోని మహదేవాపూర్‌లో విష్ణువర్ధన్ గ్రేడ్–3 వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా చేరారు. వాస్తవానికి 1984లోనే కట్టా నిరూప ప్రభుత్వ టీచర్‌గా నియమితులయ్యారు. కరీంనగర్ డీఈవో కార్యాలయంలో ఆమె పుట్టిన తేదీ ఫిబ్రవరి 01, 1956గా ఉంది. విచిత్రంగా విష్ణువర్ధన్ తన పదో తరగతి సర్టిఫికెట్లలో మార్చి 02, 1967లో జన్మించినట్లు పేర్కొన్నారు. అంటే ఇద్దరి మధ్య కేవలం పదేళ్లే వ్యత్యాసమా..? వాస్తవానికి విష్ణువర్ధన్ నియామకం సమయంలో అధికారులు ఈ చిన్న పాయింట్‌ను పసిగట్టలేకపోయారు. తీరా ఇటీవల అధికారులు విచారణ ప్రారంభించినప్పుడు అతని సర్వీసు బుక్ లభ్యమైందే తప్ప.. అతని నియామక రికార్డులు మాయం కావడం గమనార్హం.

పేరు, విద్యార్హతలపై అనేక సందేహాలు..!

విష్ణువర్ధన్ 1988లో సమర్పించిన సర్టిఫికెట్ల ప్రకారం 1967లో జన్మించానని చెప్పుకున్నారు. అవేగాక పదోన్నతుల సమయంలో మెకానికల్ ఇంజినీరింగ్ డిప్లొమా (ముంబై), బీటెక్ సివిల్ (రాజస్తాన్ డీమ్డ్ వర్సిటీ) సర్టిఫికెట్లు చూపారు. ఈ సర్టిఫికెట్ల విశ్వసనీయతపైనా దర్యాప్తు అధికారులు సందేహాలు వ్యక్తం చేశారు. వీటి ఆధారంగా విష్ణువర్ధన్ నాలుగుసార్లు పదోన్నతి పొందారు. ఈ కోర్సులు చేస్తున్న సమయంలో ఉన్నతాధికారులకు ఎలాంటి సమాచారమూ లేదు. ఆ కోర్సుల పరీక్షలకు హాజరయ్యే సమయంలో లీవు పెట్టినట్లుగా రికార్డులే లేవని, అసలు ఆ సర్టిఫికెట్లు రెగ్యులరా? లేక దూరవిద్యవా? అన్న విషయం విష్ణువర్ధన్ స్పష్టత ఇవ్వలేదని నివేదికలో పొందుపరిచారు. పదోన్నతుల సమయంలో అతని ఉన్నతాధికారులు నిబంధనల ప్రకారం వ్యవహరించలేదని, అతని సర్టిఫికెట్ల విశ్వసనీయతను సైతం పరిగణనలోకి ఎందుకు తీసుకోలేదని తోటి ఉద్యోగులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో విష్ణువర్ధన్‌ను ఇంటి వద్ద అంతా 'వాసు' అని పిలుస్తారని గుర్తు చేస్తున్నారు. ఇన్ని అక్రమాలకు పాల్పడిన అతన్ని సర్వీసు నుంచి తొలగించాలని అతని తోటి ఉద్యోగులంతా వరుసగా హైదరాబాద్ ఈఎన్‌సీ కార్యాలయానికి ఫిర్యాదులు చేస్తున్నారు.

విష్ణువర్ధన్‌ది క్రిమినల్ ఇన్‌టెన్షన్..!

వాస్తవానికి నిబంధనల ప్రకారం.. కారుణ్య నియామకం కింద టైపిస్ట్, స్టెనో, క్లర్క్ ఇలాంటి దిగువ కేటగిరీ ఉద్యోగాలు ఇవ్వాలి. కానీ.. ఇతని విషయంలో మాత్రం వర్క్ ఇన్‌స్పెక్టర్ గ్రేడ్–3 ఇవ్వడం తమకు ఆశ్చర్యానికి గురిచేసిందని నివేదికలో దర్యాప్తు అధికారులు స్పష్టంచేశారు. అతను అనర్హుడని, అక్రమార్కుడని యథేచ్ఛగా అన్ని వ్యవస్థలను మోసం చేశాడని, ఉన్నతాధికారుల కళ్లకు గంతలు కట్టాడని వివరించారు.

- అతను విధుల్లో చేరినప్పటి నుంచి ఈ రోజు వరకు విధి నిర్వహణ మొత్తం అనుమానాస్పదంగా, క్రిమినల్ ఇన్‌టెన్షన్‌తోనే ఉందన్నారు. ఇందుకు బాధ్యులైన ప్రతీ అధికారిపై చర్యలు తీసుకోవాలని సిఫారసు చేశారు.
- ఇతని అక్రమాలపై పూర్తిస్థాయిలో ఆరా తీసి, రికవరీకి కూడా సిఫారసు చేశారు. అదే సమయంలో అతని విద్యార్హతలపై గందరగోళం ఉందని వాటిపైనా లోతైన దర్యాప్తు చేయాలని చెప్పారు.

రిమూవల్ ఆఫ్ సర్వీస్ చేయాలి..

విష్ణువర్ధన్ పేరు నుంచి విద్యార్హతల వరకు అన్నీ నకిలీనే. 34 ఏళ్లుగా ప్రభుత్వ రంగ సంస్థలను మోసం చేస్తూ వస్తున్నాడు. అతని విద్యార్హతలపై చాలా కాలంగా పోరాటం చేస్తున్నాం. అత్యంత అవినీతి పరుడు, తోటి ఉద్యోగులను వేధించడం అతనికి వెన్నతో పెట్టిన విద్య. పేరెంట్స్ సర్కారు ఉద్యోగులని తేలినా కారుణ్య నియామకం కింద అతన్ని కొనసాగించడం దారుణం. వెంటనే అతన్ని రిమూవల్ ఆఫ్ సర్వీస్ చేయాలి.

– ఆమిర్, సామాజిక ఉద్యమకారుడు

క్లుప్తంగా

మక్కాన్ కుటుంబానికి శ్రీధర్‌బాబు పరామర్శ



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

రామగుండం: కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్ సోదరుడు శైలేందర్‌సింగ్ దశదినకర్మకు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. బుధవారం రామగుండం పట్టణంలోని మక్కాన్ స్వగృహంలో ఏర్పాటు చేసిన ఆయన సోదరుడి దశదినకర్మకు ఏఐసీసీ సెక్రటరీ రోహిత్ చౌదరి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ భానుప్రసాద్ రావు, ఈర్ల కొమురయ్య, రామగుండం నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్‌లతో పాటు పార్టీలకతీతంగా అధిక సంఖ్యలో ప్రముఖులు హాజరై మృతుడి చిత్రపటానికి పూలు వేసి నివాళి అర్పించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



తహసీల్దార్ కార్యాలయంలో ట్రాక్టర్లు

సుల్తానాబాద్: మండలకేంద్రం మీదుగా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. బుధవారం మండలంలోని నీరుకుల్ల, గట్టెపల్లి గ్రామాల మానేరు వాగుల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను అందిన సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు తహసీల్దార్ యాకన్న తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నడిచే ట్రాక్టర్లకు జరిమానా విధిస్తామని పేర్కొన్నారు.

తల్లీకూతుళ్ల ఆత్మహత్యాయత్నం

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మడక గ్రామంలో తల్లీకూతుళ్లు పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించారు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. మడక గ్రామంలో తల్లి ఇంట్లో పురుగులమందుతాగగా.. హుటాహుటిన కుటుంబసభ్యులు కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. తల్లి పురుగుల మందు తాగిన విషయం తెలుసుకున్న కూతురు గడ్డి మందుతాగింది. పరిస్థితి విషమంగా ఉండటంతో ఎంజీఎంకు తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. తల్లి కుతూళ్ల ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ విషయంపై పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ ఏఎస్సై లక్ష్మిరాజంను వివరణ కోరగా.. తల్లీకూతుళ్ల ఘటనలో ఎలాంటి ఫిర్యాదు అందలేదని వివరించారు.

ఆయిల్‌పాం సాగుపై నేడు అవగాహన

పెద్దపల్లిరూరల్: ఆయిల్‌పాం సాగుపై రైతులకు పెద్దపల్లి మండలం హనుమంతునిపేటలో గురువారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు అధికారి జ్యోతి తెలిపారు. ఆయిల్‌పాం సాగుతో కలిగే ప్రయోజనాలు, వచ్చే లాభాలపై శాస్త్రవేత్తలు, వ్యవసాయ, ఉద్యానవన అధికారులు వివరిస్తారని పేర్కొన్నారు. రైతులు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

పెద్దపల్లిరూరల్: మహాత్మజ్యోతి బాపూలే బీసీ గురుకుల పాఠశాలల్లో 6, 7, 8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి విద్యార్థులు ఏప్రిల్ 24వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి గౌతంకుమార్ తెలిపారు. రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలో 2023–24కుగాను నిర్వహించే ఆర్‌జేసీ సెట్‌కు టెస్ట్ విద్యార్థులు, డిగ్రీలో ప్రవేశం కోసం ఇంటర్ విద్యార్థులు ఏప్రిల్ 16 వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

బల్దియాలో కుక్కలు బాబోయ్!

- వెంటపడి మరీ కరుస్తున్నాయ్
- ఏ డివిజన్‌లో చూసినా కుక్కల భయమే
- కౌన్సిల్ ఆమోదం తెలిపినా చర్యల్లేవ్





కుక్కల దాడిలో గాయపడిన చిన్నారులు



వీధుల్లో కుక్కల స్వైరవిహారం

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలకసంస్థ పరిధిలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. గతేడాది వీధికుక్కల దాడిలో ఇద్దరు అమాయకులు బలయ్యారు. కుక్కల దాడిలో రోజుకో చోట తీవ్రంగా గాయపడుతున్నారు. ఏ కూడలిలో చూసినా గుంపులు గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు... రోడ్డుపైన కనిపించిన వారి నల్లా వెంటబడి తరుముతున్నాయి. మీదపడి కరుస్తున్నాయి. కుక్కల దాడులతో ద్విచక్ర వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. చీకటి పడిన తర్వాత కుక్కలు ఎటువైపు నుంచి దాడి చేస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. వారం రోజులుగా పలు డివిజన్లలో కుక్కలు దాడి చేస్తున్న ఘటనలు నగర ప్రజలను భయబ్రాంతులకు గురి చేస్తున్నాయి.

కుక్కల దాడులు.. చిన్నారులకు గాయాలు

రోజురోజుకు కుక్కల దాడులు పెరుగుతుండడంతో, బడి నుంచి తమ పిల్లలు ఇంటికి చేరే వరకు తల్లిదండ్రులను భయం వెంటాడుతోంది. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో గత మూడు రోజులుగా కుక్కలు రోడ్లపై నడుస్తున్న పిల్లలపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. గోదావరిఖని మారుతీనగర్‌లో ఇంటి ముందు ఆడుకుంటున్న హితేష్ అనే బాలుడిపై కుక్కలు దాడి చేసి కరిచాయి. స్థానికులు అరుపులు చేస్తూ, రాళ్లు విసరడంతో విడిచిపెట్టాయి. అదే ప్రాంతానికి చెందిన మరో ఇద్దరు పిల్లలపై కూడా కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. అడ్డగుంటపల్లి, పవర్‌హౌజ్‌కాలనీ తదితర ప్రాంతాల్లోని పిల్లలను కూడా కుక్కలు దాడి చేసి కరిచాయి. జీజీహెచ్ ఆస్పత్రితోపాటు పలు ప్రైవేట్ ఆస్పత్రులకు కుక్కకాటు బాధితులు చికిత్స పొందుతున్నారు.

కుక్కల సంతతి నివారణకు రూ.65 లక్షలు

బల్దియాలో వీధి కుక్కల సంతతి నివారణకు 2020లో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేసే ప్రక్రియను నిర్వహించారు. స్థానిక మల్కాపూర్ శివారులోని స్లాటర్ హౌజ్‌లో ప్రత్యేక ఆపరేషన్ థియేటర్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఎనిమల్ వెల్ఫేర్ సొసైటీ సంస్థ ద్వారా సుమారు 5,450 కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయడంతోపాటు యాంటీ రేబీస్ వ్యాక్సిన్లు కూడా వేసినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. ఇందుకోసం ఒక్కో కుక్కకు రూ.1200 చొప్పున చెల్లించారు. కాగా, ఇప్పటికే రూ.27 లక్షల వరకు బిల్లులు పొందిన సదరు సంస్థ, మరో రూ.38 లక్షల వరకు వరకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరడం గమనార్హం.

కౌన్సిల్ ఆమోదానికి దిక్కులేదు

బల్దియాలో వీధి కుక్కల బెడతను నియంత్రించడానికి చర్యలు తీసుకోవాలని, అందుకు అవసరమైన నిధులను ఉపయోగించుకోవాలని గత ఏడాది జరిగిన కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్లు ఆమోదించారు. వీధి కుక్కలను పడితే రూ.750, కోతులను పట్టితే రూ.800 చొప్పున చెల్లించడానికి నిర్ణయించారు. కానీ నియంత్రణ ప్రక్రియ మాత్రం ప్రారంభించలేదు. ఇప్పటికే ఇతర మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో అమలు చేస్తున్నారు.

భయంతో రాత్రంతా నిద్రపోలేదు



మా కొడుకు షితేష్‌ను మంగళవారం రాత్రి ఇంటి ముందు రెండు కుక్కలు మీదపడి కరిచాయి. రేబీస్ వ్యాధి భయంతో రాత్రంతా నిద్రపోలేదు. ఆరు నెలల క్రితమే మున్సిపాలిటీకి ఫోన్ చేసి ఫిర్యాదు చేసిన. చర్యలు తీసుకోలేదు. మరో పిల్లలు కుక్కకాటుకు గురికావద్దని నేనే కర్రపట్టుకొని కుక్కలను దూరంగా తరమడానికి రాత్రి నుంచి తిరుగుతున్న.

– సురేశ్, మారుతినగర్, గోదావరిఖని

కుక్కల బెడదను నివారించండి



రోడ్లపై కుక్కలు కనిపిస్తే పెద్దల నుంచి పిల్లల వరకు భయంతో వణుకుతున్నారు. మాతంగి కాంప్లెక్స్ ఎదుట కుక్కల గుంపు ఎక్కువగా ఉంది. గత ఏడాది ఓ వ్యక్తి కూడా కుక్కల దాడితో గాయపడి మృతి చెందాడు. అయినా చర్యలు తీసుకోలేదు. రాత్రిళ్లు బైక్‌పై రోడ్లపై వెళ్లేవాళ్లను తరుముతూ దాడి చేసి కరుస్తున్నాయి. పాలకవర్గం, అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మల్లేశ్, మాతంగి కాంప్లెక్స్, గోదావరిఖని

కుక్కలను పట్టుకునే వారిని పిలిపిస్తాం



గతంలో కుక్కలకు ఆపరేషన్లు కూడా చేయించాం. కుక్కల బెడద పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటాం. కుక్కలను పట్టుకుని, నగరానికి దూరంగా వదిలిపెట్టే వారికి సమాచారం ఇచ్చాం. ఈ పనులు చేట్టడానికి కౌన్సిల్ ఆమోదం కూడా ఉంది. త్వరలోనే పనులు చేపడుతాం. ప్రజలు భయాందోళనలకు గురికావద్దు.

– బి.సుమన్‌రావు, మున్సిపల్ కమిషనర్

కాన్షీరాం స్ఫూర్తితో బహుజన రాజ్యం సాధిద్దాం

- బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష



ప్రదర్శనలో పాల్గొన్న ఉష

పెద్దపల్లిరూరల్: కాన్షీరాం స్ఫూర్తితో ముందుకుసాగితే బహుజన రాజ్యం ఖాయమని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. జిల్లాకేంద్రంలో బస్టాండ్ నుంచి ప్రగతినగర్, కమాన్, సుభాష్‌నగర్ మీదుగా జెండావరకు ప్రదర్శన చేపట్టారు. జెండాకూడలిలో కేక్ కట్‌చేశారు. కాన్షీరాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అణగారినవర్గాల అభ్యున్నతికి అధికారం సాధించడమే మార్గమన్నారు. నాయకులు దాసరి హనుమయ్య, బాలకళ్యాణ్, చంద్రశేఖర్, కుమ్మరి సవిత, వెంకటేశ్, రాజనర్సయ్య, శేషాద్రి, బాబు, రియాజ్ తదితరులున్నారు. అంతకుముందు కాన్షీరాం విగ్రహానికి ప్రజాసంఘాల జేఏసీ నాయకుడు బొంకూరి సురేందర్‌సన్నీ, కడారి కొమురేష్ పూలమాలవేసి నివాళులర్పించారు. బీసీ సంక్షేమ సంఘ నాయకులు తాడూరి శ్రీమాన్, బొడ్డుపల్లి శ్రీనివాస్, కొండి సతీశ్, సరేందర్, మల్లేశం, సది, లక్ష్మణ్, రమేశ్‌రెడ్డి, రవీందర్, శంకర్ కాన్షీరాం జయంతిని జరుపుకున్నారు.

అడవులను సంరక్షించుకోవాలి

- ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాగయ్య



వనదర్శిని కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

పాలకుర్తి: అడవులను సంరక్షించుకోవాలి. ఇది మన సామాజిక బాధ్యత.. లేదంటే భవిష్యత్‌లో మానవ మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదముంటుందని పెద్దపల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాగయ్య అన్నారు. బుధవారం కన్నాల గ్రామ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులు, అటవీశాఖ ఆధ్వర్యంలో 'వనదర్శిని' కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా అటవీక్షేత్ర పరిశీలనకు విద్యార్థులను తీసుకెళ్లారు. పాలకుర్తి, ఈసాలతక్కళ్లపల్లి, బసంత్‌నగర్ పరిసర ప్రాంతాల్లోని అటవీక్షేత్రంలో విద్యార్థులకు ఫారెస్ట్ సెక్షన్ అధికారి రహ్మతుల్లా వివిధ అంశాలపై ప్రత్యక్ష అవగాహన కల్పించారు. దట్టమైన అటవీప్రాంతంలో చెక్‌డ్యాంల నిర్మాణం వాటి ఆవశ్యకత, ఔషధ మొక్కల పెంపకం, సాసర్ ఫిట్, పర్కోలిన్ ట్యాంక్ తదితర విషయాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం.మాధురి, జిల్లా సైన్స్ అధికారి రవినందన్ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్ బెల్ట్ గ్రేడింగ్



కరాటే బెల్టులు సాధించిన విద్యార్థులు

కరీంనగర్‌రూరల్:బొమ్మకల్ బైపాస్‌లోని బిర్లా ఓపెన్‌మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో బుధవారం మార్షల్ ఆర్ట్స్ గ్రేడింగ్ నిర్వహించారు. పలువురు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి ఛీఫ్ ఎగ్జామినర్ వసంత్‌కుమార్ బెల్టులు ప్రదానం చేశారు.మార్షల్ ఆర్ట్స్ అసిస్టెంట్ కోచ్ రాకేశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథన్, పీఈటీలు శ్రీకాంత్, సుప్రజ, అనిల్, రహీం పాల్గొన్నారు.

గ్రామంలో కనీస సౌకర్యాలు కరువు

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం వెంకట్రావుపల్లి పంచాయతీ పరిధి కేకేనగర్‌లో కనీస సౌకర్యాలు లేవని బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బూడిద సమ్మయ్య ఆరోపించారు. 40 ఏళ్ల క్రితం ఏర్పాటైన వెంకట్రావ్‌పల్లిలో ఎన్నికలు జరగకపోవడంతో అభివృద్ధి కుంటుపడిందని, గ్రామానికి ప్రత్యేక అధికారిని నియమించినప్పటికీ నామమాత్రంగా పనులు చేస్తున్నారని పేర్కొన్నారు. కనీస అవసరాలైన మరుగుదొడ్లు, తాగునీరు, రోడ్డు, వీధి దీపాలు సరిగా ఏర్పాటు చేయలేకపోయారని తెలిపారు.పంచాయతీలో రూ.కోటికి పైగా నిధులు ఉన్నా.. కనీస అవసరాలు తీర్చలేకపోతున్నారని తెలిపారు. సింగరేణి ద్వారా వచ్చే సీఎస్ఆర్ నిధులు కూడా వాడుకోవడం లేదన్నారు. వారసంతను వేలం వేయకపోవడంతో గ్రామ పంచాయతీకి వచ్చే ఆదాయానికి గండి పడుతోందని, ప్రత్యేక అధికారి స్పందించి చొరవ చూపాలన్నారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ



పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే చందర్

రామగుండం: అంతర్గాం మండలం బ్రాహ్మణపల్లి లంబాడితండా, టీటీఎస్ అంతర్గాంకు చెందిన 14 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కోరుకంటి చందర్ బుధవారం ఇళ్ల పట్టాలు అందించారు. జీఓ నంబర్ 58లో భాగంగా ప్రభుత్వ భూమిలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న లబ్ధిదారుల స్థలాలను క్రమబద్ధీకరించి పట్టాలు ఇచ్చామన్నారు. ఎంపీపీ దుర్గం విజయ, సర్పంచులు, తహసీల్దార్ వేణుగోపాల్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బానోతు తిరుపతినాయక్ తదితరులున్నారు.

ఆర్జీ- 2లో భద్రతా వారోత్సవాలు



ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

గోదావరిఖని: ఆర్జీ–2 ఏరియాలో భద్రతా వారోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఏరియా సివిల్ విభాగం ఆవరణలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్, రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్రతిఒక్కరు పీపీఈ కిట్లు ధరించాలని కోరారు. ఉద్యోగులు విధులు నిర్వహించే సమయంలో పాటించవలసిన భద్రతా నియమాల పత్రాలను ఉద్యోగులకు అందజేశారు. ఏరియా రక్షణ అధికారి బి.రవీందర్, డీజీఎం సివిల్ ధనుంజయ, సీనియర్ సెక్యూరిటీ అధికారి పీవీరమణ, ఈఈ సివిల్ ప్రతాపగిరి రాజు, జేఈ సివిల్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

పెద్దపల్లిరూరల్: నిరుపేద కుటుంబాలకు మెరుగైన వైద్యం కోసం అయ్యే ఖర్చును ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ కింద అందిస్తోందని శాసనమండలి చీఫ్‌విప్ భానుప్రసాదరావు అన్నారు. పెద్దపల్లిలో బుధవారం నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన 32 మందికి రూ.9.30 లక్షల విలువైన చెక్కులను అందించారు. గ్రంథాలయ సంస్థ జిల్లా అధ్యక్షుడు రఘువీర్‌సింగ్, నాయకులు పాగాల శ్రీకాంత్, చక్రధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కేశోరాంలో 'గుర్తింపు' కోలాహలం



నామినేషన్ వేస్తున్న నవీన్, రమేశ్ మౌర్య



నామినేషన్ వేస్తున్న మనోహర్‌రెడ్డి

- నామినేషన్ దాఖలు చేసిన పలువురు అభ్యర్థులు

పాలకుర్తి(రామగుండం): బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో గుర్తింపు కార్మికసంఘం ఎన్నికల కోలాహలం మొదలైంది. ఎన్నికల ప్రక్రియలో తొలిఘట్టమైన నామినేషన్ల దాఖలు ప్రక్రియ బుధవారం పూర్తయింది. ఈనెల 20న జరుగనున్న పర్మినెంట్ కార్మికసంఘం ఎన్నికల బరిలో నిలువనున్న ఆశావహులు తమ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పదవులకు అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి డానియల్‌కు అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున పాలకుర్తి మండలాధ్యక్షుడు ఇంజపూరి నవీన్‌కుమార్ అధ్యక్షుడిగా, రమేష్‌మౌర్య ప్రధాన కార్యదర్శి అభ్యర్థిగా, కన్నాల సింగిల్‌విండో చైర్మన్ బయ్యపు మనోహర్‌రెడ్డి అధ్యక్షుడిగా, దాడి మహేశ్ ప్రధానకార్యదర్శిగా తమ మద్దతుదారులతో కలిసి తమనామినేషన్ సమర్పించారు. కాంగ్రెస్ నుంచి జీడీనగర్ సర్పంచ్ సూర సమ్మయ్య అధ్యక్షుడిగా, రాజశ్రీ సత్తయ్య ప్రధాన కార్యదర్శి అభ్యర్థిగా, పెద్దపల్లి పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మూటం రవీందర్ అధ్యక్షుడిగా, దుర్గం నరేందర్ ప్రధాన కార్యదర్శిగా నామినేషన్లు వేశారు. గురువారం నామినేషన్ పత్రాల ఉపసంహరణ అనంతరం గుర్తులను కేటాయింపు ఉంటుందని ఎన్నికల అధికారి బి.డానియల్ తెలిపారు.

కార్మికుల హక్కులు ఐఎఫ్‌టీయూతోనే సాధ్యం

- ఐఎఫ్‌టీయూ బ్రాంచి కార్యదర్శి బి.బుచ్చన్న



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

జ్యోతినగర్: కార్మికుల హక్కులు ఐఎఫ్‌టీయూతోనే సాధ్యమని బ్రాంచి కార్యదర్శి బుచ్చన్న అన్నారు. బుధవారం ఎన్టీపీసీ రామగుండంలోని కన్జర్‌వెన్సీ సెక్షన్ వద్ద జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత నలభై ఏళ్ల నుంచి ఐఎఫ్‌టీయూ నాయకత్వంలో సింగరేణి, ఎన్టీపీసీ, బసంత్‌నగర్, హమాలీ, భవన, నిర్మాణ, మోటార్ రంగం, కేజీబీవీ గ్రామపంచాయతీ, మున్సిపల్ తదితర రంగాలలో పనిచేస్తున్న కార్మికుల పక్షాన నిలబడి అనేక ఉద్యమాలు, సమ్మెలు నిర్వహించి విజయాలు సాధించిందని తెలిపారు. 44 కార్మిక చట్టాలను నరేంద్ర మోదీ ప్రభుత్వం రద్దుచేసి నాలుగు కోడ్‌లుగా కుదించి కార్మికవర్గాన్ని పెట్టుబడిదారులకు కట్టుబానిసలుగా చేస్తోందన్నారు. ఈనెల 18,19 తేదీలలో ఎన్టీపీసీ రామగుండం టీవీ గార్డెన్స్‌లో ఐఎఫ్‌టీయూ పెద్దపల్లి జిల్లా 8వ మహాసభలను కార్మికవర్గం, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. దామోదర్, రమేశ్, సత్యం, మొండయ్య, నర్సయ్య, భాగ్యమ్మ, రాజేశ్వరి, లక్ష్మీ, ప్రమీల పాల్గొన్నారు.

మహాసభలు విజయవంతం చేయండి

యైటింక్లయిన్‌కాలనీ: ఈనెల 18,19న రెండు రోజుల పాటు ఎన్టీపీసీలోని టీవీ గార్డెన్‌లో నిర్వహించే భారత కార్మిక సంఘాల సమైక్య ఐఎఫ్‌టీయూ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర నాయకుడు బి.అశోక్ కోరారు. బుధవారం ఆర్జీ–2 ఏరియాలోని పలుజోన్లలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులతో కలసి జిల్లా మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం జీవో 14 ఆధారంగా సమాన పనికి సమాన వేతనం చెల్లించడంతో పాటు 22జీవోను గెజిట్ చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. గట్టయ్య, పోచం, లక్ష్మీ, కవిత, సమ్మయ్య, జలపతి నాయక్, మహేందర్, గౌరక్క ఉన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

ఫెర్టిలైజర్‌సిటీ: ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో జిల్లా ఎనిమిదో మహాసభలను శుక్రవారం నుంచి రెండు రోజులపాటు నిర్వహిస్తామని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నరేశ్ తెలిపారు. ఆర్ఎఫ్‌సీఎల్ కర్మాగారం గేటు ఎదుట బుధవారం మహాసభలను జయప్రదం చేయాలని గోడ పత్రికను ఆవిష్కరించారు. నాయకులు కొండ్ర మొగిలి, ఆర్ఎఫ్‌సీఎల్ బ్రాంచి నాయకులు భాషవేణి రమేశ్, రామ్‌కి, మానుక మధుకర్, మర్రి శ్రావణ్, మాదాస్ నవీన్, కుమార్ , శ్రీధర్. తదితరులు పాల్గొన్నారు.

భద్రతే.. బాధ్యతగా విధులు నిర్వహించాలి

- ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న జీఎం వెంకటేశ్వర్లు

రామగిరి(మంథని): సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ప్రతిఒక్కరూ నా భద్రతే నా బాధ్యత అనుకుంటూ విధులు నిర్వహించాలని, తద్వారా ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుదని ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు సూచించారు. సివిల్ డిపార్టుమెంట్‌లో నిర్వహిస్తున్న భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం సెంటనరీకాలనీలోని సివిల్ డిస్ట్రిబ్యూషన్ వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. సింగరేణివ్యాప్తంగా ఈనెల 13 నుంచి 21వరకు సివిల్ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సింగరేణిలో కీలకమైన విభాగాల్లో సివిల్ డిపార్టుమెంటు ఒకటని, ఇందులో పనిచేస్తున్న ప్రతిఒక్కరూ ఉత్పత్తికి నేరుగానూ, పరోక్షంగానూ ఉపయోగపడతారని ఆయన వివరించారు. అండర్ గ్రౌండ్‌లో డ్యాముల నిర్మాణం, ఎత్తైన ప్రదేశాలలో పని చేయడం, బరువైన వస్తువులను లేపడం, రోడ్ల శుభ్రతలో పనిచేయడం వంటి పనుల్లో ప్రమాదాలు పొంచి ఉంటాయని, ప్రమాదాల నియంత్రణ కోసం ఎల్లప్పుడూ భద్రతా నియమాలు పాటించాలని కార్మికులకు, సూపర్‌వైజర్లకు, అధికారులకు సూచించారు. ఏరియా ఇంజినీర్ సీతారామం, రక్షణ అధికారి సీహెచ్.వెంకటరమణ, సివిల్ ఎస్ఈ పద్మరాజు, డీవైపీఎం కే.మారుతి పాల్గొన్నారు.

కార్మికులను మరోసారి మోసం చేయడమే

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి



మాట్లాడుతున్న తుమ్మల రాజారెడ్డి

గోదావరిఖని: గత ఒప్పందాలను అమలు చేయకుండా ఎన్నికలకు వెళ్లడం కార్మికులను మరోసారి మోసం చేయడమే అవుతుందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి విమర్శించారు. బుధవారం జీడీకే–1,3 గనిలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న మారుపేర్ల మార్పు, మైనింగ్ స్టాఫ్, టెక్నికల్ స్టాఫ్, ఆపరేటర్లు మెడికల్ అన్‌ఫిట్ అయితే సూటబుల్ జాబ్ ఇవ్వాలని, తదితర సమస్యలపై, ఐదు జాతీయ సంఘాలు గుర్తింపు సంఘంతో జరిగిన ఒప్పందాలను ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. అన్ని కార్మిక సంఘాలకు కార్మికుల సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే యజమాన్యంతో జరిగిన ఒప్పందాలను అమలు చేయకుండా ఎన్నికలకు వెళ్లమని తేల్చి చెప్పాలన్నారు. నిరంతరం కార్మికుల సమస్యలపై పోరాడుతున్న తమ యూనియన్ కోడ్ ఆఫ్ డిసిప్లేన్ మార్చాలని, రెండు సంవత్సరాలకే ఎన్నికలు నిర్వహించాలని, రెండు ఓట్ల విధానం కావాలని, గతంలో కార్మిక సంఘాలతో చేసుకున్న ఒప్పందాలను తక్షణం అమలు చేయాలని, లేబర్ కమిషన్ ముందు ఉంచామన్నారు. గేట్ మీటింగ్‌లో నాయకులు ఆరెపల్లి రాజమౌళి, ఎస్‌కే గౌస్, తోట నరహరిరావు, దాసరి సురేష్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా రేషన్‌బియ్యం దందా!



బియ్యం కొనుగోలు చేస్తున్న దళారీ



ఆటోలో తరలిస్తున్న బియ్యం

ఎలిగేడు(పెద్దపల్లి): మండలంలోని పలు గ్రామాల్లో రేషన్‌బియ్యం దందా జోరుగా సాగుతోంది. రేషన్ దకాణాల్లో ప్రతీ నెల 1వ తేదీ నుంచి 15వ తేదీవరకు లబ్ధిదారులకు బియ్యం పంపిణీ జరుగుతుంది. పదో తేదీ నుంచి దళారులు గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ బియ్యం కిలోకు రూ.8 నుంచి రూ.10 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. గ్రామాల్లో ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ కొనుగోలు చేసిన బియ్యాన్ని ఒకచోట నిల్వ ఉంచి తరువాత ఆటోల్లో తరలిస్తున్నారు. పలు గ్రామాల్లో అయితే రేషన్‌షాపు నుంచే బియ్యం కొనుగోలు చేసుకెళ్తున్నారంటే అధికారుల నిర్లక్ష్యం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. దళారులు కొనుగోలు చేసిన రేషన్‌బియ్యాన్ని కరీంనగర్, పెద్దపల్లి, సుల్తానాబాద్ పట్టణాలకు చెందిన వ్యాపారులకు కిలోకు రూ.12 నుంచి రూ.14 చొప్పున విక్రయిస్తున్నారు. మండలంలో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి దళారులు ద్విచక్రవాహనాలు, ట్రాలీఆటోల్లో యథేచ్ఛగా తరలిస్తున్నప్పటికీ పోలీసులు, సివిల్‌సప్లై, రెవెన్యూ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినపడుతున్నాయి. అధికారులు స్పందించి మండలంలో రేషన్ దందాపై నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.